క్లుప్తంగా

కులగణనతో సామాజిక న్యాయం



కులగణలో భాగంగా వివరాలు తెలుపుతున్న ఎంపీపీ

కపిలేశ్వరపురం (మండపేట): కులగణనతో సామాజిక న్యాయానికి మార్గం సుగమం అవుతుందని మండపేట ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు అన్నారు. సోమవారం కేశవరం కుల గణన సర్వేను ఆయన ప్రారంభించారు. మండలంలోని గ్రామాల్లో నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు త్వరితగతిన కులగణనను పూర్తి చేసేందుకు కృషి చేయాలని సిబ్బందిని ఎంపీడీఓ ఐదం రాజు ఆదేశించారు. కార్యక్రమంలో పినిపే చంద్రశేఖర్, వ్యవసాయ సహాయకులు బాలకృష్ణ, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు సురక్ష వైద్య శిబిరం

కాజులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంజేరులో జరుగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ ఎన్ సౌజన్య అన్నారు. బీపీ, షుగర్, పలు దీర్ఘకాలిక తదితర అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తామని తెలిపారు.

బీమా సొమ్ము అందజేత



బీమా సొమ్మును అందజేస్తున్న చైర్ పర్సన్ శ్రీదేవి కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

రామచంద్రపురం: రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తికి వచ్చిన వైఎస్సార్ బీమా సొమ్మును సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని గుబ్బల వారిపేటకు చెందిన గుత్తుల లక్ష్మి గత ఏడాది డిసెంబర్ 9 బిక్కవోలు మండలం తొస్సిపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని మృతి చెందింది. లక్ష్మి భర్త కృష్ణకు సొమ్ము అందజేశారు. సచివాలయ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సమ ప్రాధాన్యతతో బూత్ కమిటీల ఏర్పాటు

కపిలేశ్వరపురం (మండపేట): కపిలేశ్వరపురం మండలంలోని గ్రామాల్లో సామాజిక వర్గాలు, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న తీరు తదితర సమ ప్రాధాన్యంతో సమర్థవంతంగా బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ యువనేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండల పార్టీ నాయకులకు సూచించారు. ఆ మేరకు సోమవారం అంగరలోని పార్టీ మండల కార్యాలయంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, నాయకులు వంగా శ్రీనివాస్, సలాది వీరబాబు, గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో చర్చించారు. అందరితో చర్చించి గ్రామ, మండల బూత్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు.

విగ్రహాల నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం (మండపేట): సామాజిక న్యాయ సాధనే లక్ష్యంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మండపేట పట్టణం కరాచీ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహాల ప్రతిష్ఠ కోసం బేస్‌మెంట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ సోమవారం ని పరిశీలించారు. ఆయన వెంట పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



నరసాపురపుపేటలో మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు జిల్లా ప్రజాపరిషత్ అందజేసిన విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రెడ్డి రాజారమేష్, సభ్యులు బి.సత్యవేణి, వారణాసి సత్తిబాబు, గ్రామ పెద్ద దంగేటి లోవరాజు, సచివాలయ ఉద్యోగి కె.శ్రీనుబాబు, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, మహాలక్ష్మి, రవికుమార్, పద్మావతి పాల్గొన్నారు.

అంతా రామమయం

- శ్రీరామనామ స్మరణతో మార్మోగిన గ్రామాలు
- ఆలయాల్లో పూజలు, భజనలు
- శోభాయాత్రలు, బైక్ ర్యాలీలు
- భక్తులకు అన్నదానం, ప్రసాదం పంపిణీ

రామచంద్రపురం: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని రామచంద్రపురం నియోజకవర్గంలో ఊరూ వాడా అంతా పండగ వాతావరణం సంతరించుకుంది. ప్రతి గ్రామంలోను రామాలయాల వద్ద భజనలు, భక్తి కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. శోభాయాత్రలు, బైక్‌ర్యాలీలు చేస్తూ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. రామచంద్రపురం పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ రామ భక్త కమిటీలు, వ్యాపార సంస్థలు ఆధ్వర్యంలో శోభాయాత్రలు బైక్ ర్యాలీలు నిర్వహించారు. రాజగోపాల్ సెంటర్‌లో ప్రసాద వితరణ చేశారు. వెల్ల వంతెన వద్ద జరిగిన అన్నసంతర్పణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో

పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. రథంలో శ్రీరాముని ఉంచి ఊరేగించారు. ఈ యాత్రలో నాయకులు కేశవ రాఘవేంద్ర, కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్ నాయుడు, సలాది శేఖర్ కృష్ణమూర్తి, ఎం రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు

శ్రీరామ సంకీర్తన ర్యాలీ

మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జి.వి.రావు నేతృత్వంలో మోడరన్ జి.ఆర్.సి.జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్ పర్యవేక్షణలో మోడరన్ జూనియర్ కాలేజి స్టాఫ్, విద్యార్థులు ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీరాముని దివ్య మంగళ రూపాన్ని పల్లకిలో సోమవారం ఊరేగించారు. ప్రధాన రహదారులలో 'శ్రీరామ సంకీర్తన' ర్యాలీ నిర్వహించారు.

రాయవరంలో...

రాయవరం: మండల ప్రజలందరూ శ్రీరామనామ జపం చేశారు. జై శ్రీరామ నామంతో గ్రామాలన్నీ మార్మోగాయి. మండలంలోని ఉత్సవ కమిటీలు, భక్తులు యాత్రలు చేశారు. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను వీక్షించేందుకు పలు చోట్ల ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. మండలంలోని రాయవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, సోమేశ్వరం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కె.గంగవరం మండలంలో...

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రామ భజనలు, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు.

రామచంద్రపురం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం వద్ద ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం నుంచి రథంపై రాములవారి శోభాయాత్ర ప్రారంభమైంది. ఆలయ అర్చకులు, చండీ హోమం, శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయంలో భజనలు, కోలాటాలు చేశారు. వడపప్పు, చలివిడి, పానకం, పులిహోర ప్రసాద వితరణ చేశారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. వెలంపాలెం లక్ష్మీనారాయణస్వామి ఆలయం వద్ద శోభాయాత్ర నిర్వహించారు. హసన్‌బాద శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం, రూరల్ మండలంలోని 12 గ్రామాల్లో సోమవారం రామనామ స్మరణతో మార్మోగింది. జియ్యర్ల జన్మస్థలమైన అర్తమూరు గ్రామంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వికాస తరంగిని అధ్యక్షుడు కర్రి పాపారాయుడు ఆధ్వర్యంలో సంబరాలు అంబరాన్నంటాయి. రామ సంకీర్తనలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నెక్ చైర్మన్ పడాల సుబ్బారెడ్డి, పడాల రామకృష్ణారెడ్డి, కాయల సత్తిరాజు పాల్గొన్నారు. మండపేట పట్టణంలో మోటార్ సైకిళ్ల శోభాయాత్రను నిర్వహించారు. బీజేపీ నాయకులు కోటిపల్లి వీవీ సాయిరామ్, కోన సత్యనారాయణ, వల్లభనేని రవీంద్రబాబు, రాయి వీర్రాజు పాల్గొన్నారు. మండపేట విద్యావికాస్ విద్యాసంస్థల్లో అయోధ్య ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ద్వారపూడిలో సీతారాముల కళ్యాణ పూజలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం మండలంలో...

మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో భక్తులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కపిలేశ్వరపురం, తాతపూడి, వల్లూరు, వెదురుమూడి, నేలటూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, వడ్లమూరు, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో సూర్య హైస్కూల్ ఆధ్వర్యంలో బాల రామయ్యలు, చిన్నారి సీతమ్మలతో కలసి గ్రామంలో జై శ్రీరామ్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. రామయ్య, సీతమ్మల వేషధారణలో చిన్నారులు విశేషంగా ఆకట్టుకున్నారు.

కాజులూరు: మండలంలోని రామాలయాల్లో పూజలు, భజనలు చేశారు. గొల్లపాలెంలో విశ్వహిందు పరిషత్ సభ్యులు శ్రీ రాముని చిత్రపటాలతో వీధుల్లో శోభాయాత్ర చేశారు.

22ఆర్‌సీపీ,22:గొల్లపాలెంలో ప్రసాదాలు వితరణ చేస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని బియ్యంపేట కోదండ రామాలయం వద్ద మహిళలు జై శ్రీరామ, ఓం, రామబాణం ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాల్లో పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో గ్రామాల ప్రజలు నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయం నుంచి శోభాయాత్ర



ద్రాక్షారామలో అఖండ దీపారాధన



ద్రాక్షారామ వీధుల్లో బాల రామయ్యలు, చిన్నారి సీతమ్మల ర్యాలీ



అంగరలో స్వామిని దర్శించుకుంటున్న పృథ్వీరాజ్



పసలపూడిలో శ్రీరాముడి ఊరేగింపు



సత్యవాడ గ్రామంలో భజన చేస్తున్న భక్తులు



రామ సంకీర్తనతో విద్యార్థులు, నాయకుల ర్యాలీ



కళాశాలలో అయోధ్య ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

గ్రామాల్లో బోస్ పర్యటన

కె.గంగవరం: మండల పరిధిలోని పాణింగపల్లి, పామర్రు, అముజూరు, కూళ్ల గ్రామాల్లో సోమవారం రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పలు సంఘాలకు చెందిన గ్రామ పెద్దలను మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాష్‌కు తమ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో పెద్దలు రాజ్యసభ సభ్యులు బోస్‌ను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. పార్టీ రాజానగరం పరిశీలకులు వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పండు గోవిందరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా కమిటి సభ్యులు బత్తుల అప్పారావు, నాయకులు చిట్టూరి చిన్ని, వల్లభురెడ్డి చిన్ని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కూళ్లలో బోస్‌ను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

సైన్స్ ప్రదర్శనతో సృజన వెలికితీత

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు స్టాలిన్
- విజేతలకు బహుమతుల ప్రదానం

రామచంద్రపురం: సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతో దోహదపడతాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ అన్నారు. రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రామానుజన్ గణిత అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ మాట్లాడారు. బాలికలు శాస్త్రవేత్తల ఎదగాలంటే ప్రయోగాత్మక విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సుమారు 100 ప్రాజెక్టులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. బహుమతి ప్రధాన కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి వి.నాగేశ్వరి, మోడల్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు కోనసీమ జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ మేడమ్ క్యూరీస్ ఆదర్శంగా తీసుకుని బాలికలు భావిభారత శాస్త్రవేత్తలుగా తయారు కావాలన్నారు. కాకినాడ జిల్లా సైన్స్ ఆఫీసర్ పీఎస్ వినీల్, తూర్పుగోదావరి జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ నెహ్రూ రేవతి, సైన్స్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బుద్ధా శ్రీనివాస్, గరగ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న స్టాలిన్ తదితరులు

విజేతలు వీరే..

సైన్స్ ఎగ్జిబిషన్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం సీహెచ్ దేవి మనోజ ప్రతిభ హై స్కూల్ సామర్లకోట, ద్వితీయ స్థానం షేక్ అఫియా ఫాతిమా శ్రీగౌతమి పాఠశాల రాజమండ్రి, తృతీయ స్థానం జి కావ్య సుధా ఏ చంద్రమణి శ్రీ వాగ్దేవి పాఠశాల అమలాపురం సాధించారు. సీనియర్స్ భాగంలో ప్రథమ స్థానం ఎన్.వైష్ణవి ప్రతిభ హై స్కూల్ సామర్లకోట, ద్వితీయ స్థానం టీబీఎస్ ప్రసన్న జెడ్పీహెచ్ ఎస్ రంగంపేట, తృతీయ స్థానం షేక్ షహనా బేగం కెనడి హై స్కూల్ గుంటూరులు గెలుపొందారు. శాస్త్రవేత్తల ఏకపాత్రానయంలో ప్రథమ స్థానం కేఎల్ సంతోషి జెడ్పీహెచ్ఎస్ కొవ్వూరు పాడు, ద్వితీయ స్థానం బి.హేమశ్రీ ప్రతిభ హై స్కూల్ సామర్లకోట, తృతీయ స్థానం ఓ అశ్విని ఎంపీ యూపీ స్కూల్ యండమూరు కరప మండలంలు గెలుపొందారు. వీరికి అతిథులు బహుమతి ప్రదానం చేశారు.

సత్తెమ్మా.. చల్లగా చూడమ్మా..

- ముగిసిన అమ్మవారి జాతర
- విచిత్ర వేషధారణలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

అనపర్తి: కొప్పవరం గ్రామ దేవత సత్తెమ్మతల్లి జాతర సోమవారంతో ముగిసింది. ఈ జాతరకు విచిత్ర సంప్రదాయం ఉంది. మిగిలిన గ్రామ దేవతల జాతరలకు భిన్నంగా పగటిపూట జరుగుతుంది. అంతేకాకుండా ఈ జాతరలో భక్తులు విచిత్ర వేషధారణలతో మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా సామాన్యుడు నుంచి శ్రీమంతులు వరకూ మొక్కుకున్నది ఎవరైనా సరే తర తమ బేధం లేకుండా జోలి పట్టి భిక్షమెత్తుకునే విలక్షణ ఆనవాయితీ కొప్పవరం సత్తెమ్మతల్లి జాతరలో ప్రత్యేకం. దీనికనుగుణంగా సోమవారం ఉదయం నుంచి వందల సంఖ్యలో భక్తులు చిత్రవిచిత్ర వేషధారణలతో అందరినీ అలరిస్తూ, ఆనందపరుస్తూ భవతీ భిక్షాం దేహి అంటూ గ్రామంలో బిచ్చమెత్తుకుని తద్వారా వచ్చిన మొత్తాన్ని అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరలో చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ ఒకొక్కరూ ఒక్కో వేషధారణలో దర్శనమిచ్చారు.



లవకుశల వేషధారణలతో బాలురు



ఆర్ఆర్ఆర్ చిత్రంలోని ఓ సన్నివేశాన్ని ప్రదర్శిస్తూ విచిత్ర వేషధారణలతో మొక్కును తీర్చుకున్న యువకులు

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థి ఎంపిక



గోపి కిరణ్మయి

కాజులూరు: ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు తమ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని గోపి కిరణ్మయి ఎంపికైనట్టు గొల్లపాలెం జెడ్పీహై స్కూల్ హెచ్ఎం ఎస్ఎస్‌బి సుశీలమణి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఆమె విలేకరులకు తెలిపారు. ఈస్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయ్యే వరకూ ప్రభుత్వం నుంచి ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం అందుతుందన్నారు. గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, ఎంపీటీసి జొన్నకూటి సత్యపద్మజా, స్కూల్ పేరెన్స్‌కమిటీ చైర్మన్ మాత నాగరాజు, స్టాఫ్ సెక్రటరీ పి.సత్యనారాయణ తదితరులు స్కాలర్ షిప్‌కు ఎంపికైన విద్యార్థి కిరణ్మయిని అభినందించారు.

సోషల్ ఆడిట్ షెడ్యూల్ విడుదల

రాయవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, ఉపాధి హామీ ఏపీఎం సుధారాణిల నేతృత్వంలో నిర్వహించే సోషల్ ఆడిట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ విషయాన్ని ఎన్ఆర్ఈజీఎస్ జేఈ ఈశ్వర్ సోమవారం విలేకరులకు తెలిపారు. మంగళవారం నుంచి ఈ నెల 27 వరకూ కూర్మాపురం, వెంటూరు, కురకాళ్లపల్లి, వి.సావరం, 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ రాయవరం, సోమేశ్వరం, మాచవరం, 26 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు చెల్లూరు ఆడిట్ జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 1 నుంచి ఐదో తేదీ వరకూ పసలపూడి, లొల్ల, వెదురుపాక గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే సోషల్ ఆడిట్ అనంతరం చివరి రోజు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 12 గ్రామాల్లో నిర్వహించిన 1,298 ఉపాధి హామీ పనులకు సంబంధించి పరిశీలిస్తారన్నారు. ఈ పనులకు సంబంధించి రూ.4,23,18,242 వేతనాల రూపంలో చెల్లించగా, రూ.3,24,759 మెటీరియల్ రూపంలో చెల్లింపులు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ

రంగంపేట: రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలో తమ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థసారథి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో రేవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ కృష్ణసాయి నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలో 9వ తరగతి విద్యార్థిని టీబీఎస్ ప్రసన్న తయారు చేసిన బయోమెట్రిక్ ఓటింగ్ యంత్రం అనే అంశానికి ఉత్తమ బహుమతి, మూడు వేల నగదు, సైన్స్ కిట్టు, సైన్స్ పుస్తకాలు, ధ్రువీకరణపత్రం అందుకున్నట్టు తెలిపారు. విద్యార్థిని ప్రసన్నను, గైడ్ టీచర్ రమ్యసుధను పలువురు అభినందించారు.

క్రికెట్ పోటీల విజేత గాడాల

మధురపూడి: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు సోమవారంతో ముగిశాయి. క్రికెట్‌లో గాడాల జట్టు విన్నర్‌గా నిలిచింది. కోటి జట్టుపై ఫైనల్స్‌లో విజయం సాధించింది.

పాత వారికే కొత్తగా కండువాలు

కపిలేశ్వరపురం (మండపేట): నేలటూరు గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ పాత కార్యకర్తలకు కొత్త కండువాలను కప్పి వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరారంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వ్యవహార శైలి హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు అన్నారు. గ్రామంలో సోమవారం సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ రుద్రాక్షుల వీరగౌరీ కుమారి, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు, నాయకులు కొప్పిశెట్టి కిశోర్, రుద్రాక్షుల శ్రీనివాస్, సిద్దాని రవి, శలా ఏసు, ఎల్లే గంగరాజు, రుద్రాక్షుల చినవీర్రాజులు ఎమ్మెల్యే వైఖరిని ఖండించారు. వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమం లేదని, జోగేశ్వరరావుతోనే సంక్షేమం అందుతుందని నమ్మి టీడీపీలో చేరామంటూ కొందరితో ప్రకటనలు చేయడం ఆయన స్థాయికి తగదన్నారు. టీడీపీలో చేరామంటూ ప్రకటించిన వ్యక్తులు ఎవ్వరూ వైఎస్సార్ సీపీకి చెందిన వారు కాదని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో నేలటూరు గ్రామం అభివృద్ధి చెందుతుందని వారన్నారు. ప్రజలకు గతంలో ఏమి చేశారో, అధికారమిస్తే ఏమి చేస్తారో చెప్పుకోవాల్సిన జోగేశ్వరరావు అవాస్తవాలను ప్రచారం చేస్తూ, ప్రజలను మభ్యపెట్టే కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు.



నేలటూరులో మాట్లాడుతున్న సర్పంచ్, ప్రజాప్రతినిధులు

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఆరోగ్యశ్రీ కార్డులు ఎంతగానో దోహదపడతాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సత్యనారాయణ అన్నారు. అంగర పీహెచ్‌సీ పరిధిలోని పడమర ఖండ్రికలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు, బ్రోచర్లలో లబ్ధిదారుల ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. క్షేత్ర స్థాయిలోని లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డుల వినియోగంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి పీఎస్ఎస్‌డి రత్నకుమారి, ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లికార్జునరావు, హెచ్ఈ బి.రామారావు, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఉన్నారు.



పడమర ఖండ్రికలో కార్డుల అందజేస్తున్న ఇమ్యూనైజేషన్ అధికారి

కె.గంగవరం: గ్రామాల్లో ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు రామచంద్రపురం సబ్ డివిజనల్ ఆఫీసర్ ఎస్.ప్రశాంతి, సబ్ డివిజనల్ సూపర్‌వైజర్ జి. కమల్ శేషు అన్నారు. యర్రపోతవరంలో జరుగుతున్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ప్రక్రియను సోమవారం వారు పరిశీలించారు. మండలంలో 18,896 కార్డులకు గాను 11,029 కార్డులు పంపిణీ జరిగిందన్నారు.

ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాల వెలుగులు


రాయవరం: రాయవరంలో జరుగుతున్న పోలమ్మ జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల సోయగాలు పలువురిని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం జాతర జరగనున్న నేపథ్యంలో సోమవారం రాత్రికి పూర్తి స్థాయిలో ఎల్ఈడీ విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. కళ్లు మిరుమిట్లు గొలిపేలా ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వెలంపేట రామాలయం, పోలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు , కదిలే మిక్కీ మౌస్, తాబేలు, రొయ్య, డాల్ఫిన్స్ తదితర బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే వివిధ రకాల ఆకతులతో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



అలరిస్తున్న కదిలే మిక్కీమౌస్



ఆకట్టుకుంటున్న అయోధ్య రాముడు



కొండపల్లి బొమ్మలు



మిరుమిట్లు గొలిపే స్వాగత ద్వారాలు